మిర్చి రైతుకు కన్నీరే!

- దిగుబడి బాగానే వచ్చినా.. ఒక్కసారిగా పడిపోయిన ధర
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- కరువు సబ్సిడీ ఇవ్వని వైనం
- నష్టాల్లో రైతన్నలు


మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న రైతులు

కౌతాళం: మిరప పంట సాగు చేసిన రైతులకు ఆందోళన, ఆవేదన తప్ప ఏమీ మిగలలేదు. ఎండుమిచ్చి ధర ఒక్కసారిగా పతనం కావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి దిగుబడి ఎకరాకు 10 కింటళ్లు వచ్చినా.. పెట్టుబడి పోను తమకు లాభాలు వస్తాయని ఆశించిన రైతన్నలకు నిరాశే మిగిలింది. ఇక వంకల పక్కన, వాగుల పక్కన సాగు చేసిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. భారీ వర్షాలకు పంట పూర్తిగా కొట్టుకుని పోగా, పొలాల్లో ఇసుక మేట వేయడంతో నష్టాలు మూటగట్టుకున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయడంలేదు. పైగా కౌతాళాన్ని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి..

గతేడాది ప్రారంభంలో మిరపకు ఆశించిన ధర దక్కడంతో ఈ ఏడాది కౌతాళం మండలంలో 15 వేల ఎకారల్లో అదే పంటను రైతులు సాగు చేశారు. కాగా, గతేడాది చివరల్లో ఎండు మిరప పంటకు ధర క్వింటా రూ.20వేలకు పడి పోవడంతో రైతులు చాల మంది దిగుబడులను అధిక ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని ఏసీ గోదాముల్లో భద్రపరిచారు. అయితే ప్రస్తుతం మిరప పంట ధర రూ.12 వేల నుంచి రూ.15 వేలు పలుకుతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది పంటను ఏసీల్లో భద్రపరచకుండా అమ్ముకొని ఉంటే కనీసం పెట్టుబడి అయినా వచ్చేదని.. ఇప్పుడు ధర రూ.12వేలు పలకడంతో క్వింటాకు రూ.8వేలు నష్టపోవాల్సి వస్తోందని, దీనికితోడు ఏసీ బాడుగలు అదనంగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు పెద్దహుసేని, దస్తగిరి, గిరెప్ప, నబి, శ్రీనివాసులు, రామచంద్ర, మారెప్ప, రాజసాబ్ పలువురు వాపోయారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఇప్పటికే ఎకరాకు ఒకటిన్నర లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరప రైతుకు భరోసా ఇవ్వని ప్రభుత్వం

కౌతాళం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించింది. అయితే పత్తి, ఆముదం, వేరుశనగ, కంది నాల్గు పంటలకు మాత్రమే కరువు జాబితాలో ప్రకటించడం.. ఇందులో మిరప పంట లేకపోవడంతో రైతులు మరింత ఆవేదన చెందతున్నారు. ఇంత నష్టం జరిగినా.. ధర పూర్తిగా పతనం అయినా ప్రభుత్వం ఆదుకోవడం లేదని వాపోతున్నారు. మిరప పంటకు కూడా కరువు సబ్సిడీ వచ్చేల చేస్తే ఎంతో మేలు జరిగేదని, కుటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.20లక్షల వరకు నష్టం



40 ఎకరాల్లో పంట సాగు చేసి సుమారు 80లక్షల వరకు ఖర్చు చేశాను. దిగుబడి వచ్చినప్పుడు రూ.20వేలు ధర ఉండేది, తక్కువ ధర అని 2,376 బస్తాలను ఏసీలో భద్రపరిచాను. సుమారుగా 700క్వింటళ్లు. ఇప్పుడు దానిని అమ్మితే రూ.20లక్షల నష్టం వస్తుంది. ఈ ఏడాది కూడా 40ఎకరాల్లో మిరపను సాగు చేశాను. ఇంత దారుణంగా ధర పడిపోవడంతో దిక్కుతోచడం లేదు. గతేడాది పంట అలాగే ఉండిపోవడం, ప్రస్తుతం ఉన్న పంటకు ధర లేకపోవడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. –పెద్దహుసేని, ఉప్పరహాల్

కరువు వర్తించదనడం అన్యాయం



కరువు కింద మండలాన్ని ప్రకటించినా.. మిరప పంటకు నష్టం లేదు, కరువు వర్తించదు అంటే మాలాంటి పేద రైతుల పరిస్థితి ఎలా. వంక వచ్చి రెండు ఎకరాల పంట పూర్తి దెబ్బతిన్నది. మిగిలిన రెండు ఎకరాల పంట మాత్రమే ఉంది. ధర పతనం కావడంతో మాలాంటి రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయి.

– రాజసాబ్, కౌతాళం

వైభవంగా ప్రభోత్సవం


భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి వారి ప్రభ

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామ ప్రజల ఆరాధ్యదైవం శ్రీ తిరుమలేశ్వర స్వామి వారి ప్రభోత్సవం శనివారం సాయంత్రం భక్తుల మధ్య వైభవంగా సాగింది. వేకువజామున నుంచి స్వామి వారికి ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఫలపుష్పాలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేలాది మంది భక్తులు తిలకిస్తుండగా ఉత్సవమూర్తిని ప్రభలో కొలువుచేరారు. అనంతరం కలశాలు, మేళతాళాలతో ఆలయం నుంచి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. ఊరేగింపునకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డి నరసన్న, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, బండ్ల గోవిందు, మల్లికార్జున గౌడ, రవిగౌడ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహమంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

రబీ పంటలకు సాగునీరు


కాలువను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ కింద ఆయకట్టుకు ఈసారి రబీ సీజన్‌లో కూడా పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తామని ఎల్ఎల్‌సీ ఈఈ శైలేశ్వర్, డీఈ మహమ్మద్‌షఫీ తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువపై వారు శనివారం పర్యటించి 74, 75, కౌతాళం మేజర్, మాధవరం మేజర్, హాల్వి సెక్షన్‌లలో సాగునీటి సరఫరాను పరిశీలించారు. వారు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ పుష్కలంగా ఉన్నందున ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగుచేసే పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు అందుతాయన్నారు. వారి వెంట ఏఈ ఈశ్వర్ ఉన్నారు.

వార్డు సచివాలయం తనిఖీ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శంకర్‌నగర్‌లోని 23వ వార్డు సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల సంఖ్య, హాజరు, గైర్హాజరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్లుబావి వీధిలోని బద్రినారాయణస్వామి ఆలయాన్ని దర్శించారు.

కొనసాగుతున్న దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప మాట్లాడారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన పరమేష్(38) రెండు నెలల నుంచి కనిపించడంలేదని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఇంటికి అప్పుడప్పుడు వస్తూ వెళ్తుండేవాడని, అయితే రెండు నెలల నుంచి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లోనూ, తెలిసిన వారివద్ద వెతికినా కనిపించకపోవంతో అనుమానం వచ్చి శనివారం భార్య ఫిర్యాదు చేసిందని చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


రోగికి అందిస్తున్న వైద్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. శనివారం పట్టణంలో బద్రి నారాయణ వెల్ఫేర్ సొసైటీ అండ్ నవభారత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బెంగళూకు చెందిన జింకేర్ ఆస్పత్రి వైద్యులచే ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన చికిత్సలు 24 గంటలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు


సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కర్నూలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 165 మంది డ్రైవర్లు, కండెక్టర్లకు ప్రముఖ వైద్యులు సందీప్‌కుమార్, మనోజ్‌కుమార్ గుండె పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని ప్రముఖ వైద్యులు గౌడప్ప గౌడ్ ప్రారంభించగా డిపో మేనేజర్ అమర్నాథ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి, సభ్యులు మాచాని శివశంకర్, మాచాని శివకుమార్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఆదోని జడ్జి పి.జె.సుధ


మాట్లాడుతున్న నంద్యాల సివిల్ జడ్జి బి.రాధారాణి

ఆదోని రూరల్: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల సమస్యలకు పరిష్కారమార్గం చూపాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ విధానం చాలా విస్తృతంగా పనిచేస్తుందన్నారు. చిన్నచిన్న గొడవలను మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ ఇచ్చి రాజీమార్గం చూపాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సురేంద్రకుమార్, ట్రెజరర్ లతీఫ్‌అహ్మద్ పాల్గొన్నారు.

కేసుల్లో మధ్యవర్తిత్వం అవసరం

ఎమ్మిగనూరుటౌన్: కేసుల్లో కక్షిదారులకు విముక్తి కలుగుతుందంటే న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించడం ఎంతో అవసరమని సీనియర్ డివిజన్ నంద్యాల సివిల్ జడ్జి బి.రాధారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ భవిష్యత్‌లో వ్యాజ్యాలను నియంత్రించడంలో మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యత ఉంటుందన్నారు. న్యాయస్థానాలపై భారాన్ని తగ్గించడం, న్యాయవాదులకు సత్వర న్యాయం అందించేందుకు ఇలాంటి అవగాహన సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే గురురాజారావు, న్యాయవాదులు మురళీకృష్ణ, దామోదర్‌రెడ్డి, నాగరాజ్, రంగనాథ్, కుమార్, నారాయణ, సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోసిగి రోడ్డులో వెలసిన శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి, శ్రీవల్లిదేవసేన దంపతుల కల్యాణ మహోత్సవం శనివారం ఆలయంలో కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ తంతు వైభవంగా సాగింది. స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర కుసుమార్చన చేశారు. స్వామి వారి కల్యాణం అనంతరం అన్నదానం, సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ చేపట్టారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలిరాగా పురోహితులు విష్ణువర్ధన శాస్త్రి, శివమణి శాస్త్రి, శంకరమణి శాస్త్రి ఆలయ ధర్మకర్త యుజి కేశవర్ధన పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి

ఆదోని టౌన్: ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ ఆదోని మున్సిపాలిటీలోని వాటర్ వర్క్స్ కార్మికులు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. వాటర్ వర్క్స్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు పీరా, కార్యదర్శి అహ్మద్, ఉపాధ్యక్షులు సోమన్న మాట్లాడారు. 20 ఏళ్లకు పైగానే వాటర్ వర్క్స్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన తాము పనిచేస్తున్నామని, తమకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యేకు వివరించారు. 20 ఏళ్లకు పైగానే వ్యట్టిచాకిరి చేస్తున్నా తమకు ఎలాంటి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

9న 'చలో కడప'

ఆదోని రూరల్: రాయలసీమ స్పిన్నింగ్ మిల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9వ తేదీన చేపట్టిన చలో కడప కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయలసీమ మిల్లు 2002 మూతబడిన తర్వాత దాదాపు 200 మంది కార్మికులుకు ఇప్పటివరకు పీఎఫ్, పింఛన్, 18 నెలలు పనిచేసిన వేతన బకాయిలు రాలేదన్నారు. వాటిని వెంటనే చెల్లించాలన్నారు. ఈనెల 9వ తేదీన కడపలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు కుమార్, బాషా, నారాయణప్ప, కృష్ణ, రుక్మిణి, భీమలింగప్ప, ఖాదర్, కుమార్ పాల్గొన్నారు.

క్యాంపస్ నియామకాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం భారీగా క్యాంపస్ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.వీరన్న మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన రినిక్స్ టెక్నాలజీ కంపెనీ వారు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న 51 మంది విద్యార్థులను, ఎంబీఏ నుంచి 7 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్, ప్లేస్‌మెంట్ డీన్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావొద్దు


కడివెళ్ల మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న రూరల్ సీఐ మధుసూదన్‌రావు


కేజీబీవీలో డ్రగ్స్ నిర్మూలన, బాలికల సంరక్షణ కరపత్రాలను విడుదల చేస్తున్న మండల అధికారులు

ఎమ్మిగనూరురూరల్: యవత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని రూరల్ సీఐ మధుసూదన్‌రావు సూచించారు. శనివారం మండల పరిధిలోని ఏపీ గురుకుల పాఠశాల, కడివెళ్ల, దైవందిన్నె, ఎర్రకోట, కోటేకల్ హైస్కూల్స్, ఏపీ కడివెళ్ల మోడల్ స్కూల్, గుడుకల్, కె.తిమ్మాపురం గ్రామాలతో పాటు అన్ని పాఠశాలలో పేరెంట్స్ మీట్‌తో పాటు ‘డ్రగ్స్ వద్దు బ్రో’ అనే కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటికి అలవాటుపడి తమ బంగారు భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుకోవద్దన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

నందవరం : విద్యార్థినీవిద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని తహసీల్దార్ కె. శ్రీనివాసులు, ఎస్ఐ వి, శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల కేంద్రం కేజీబీవీతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోమలగూడూరు, హాలహర్వి, ముగతి గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలో పోలీసులు ఆధ్వర్యంలో ‘డ్రగ్స్ వద్దు బ్రో’ కార్యక్రమం చేపట్టారు. కేజీబీవీ పాఠశాలలో మత్తు పదర్థాల వల్ల కలిగే నష్టలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్నిసా బేగం బాల్య వివాహాలు, బాలికల హక్కు, సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, సూపర్‌వైజర్ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. శనివారం పట్టణంలోని అమరావతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ‘డ్రగ్స్ వద్దు బ్రో’ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాలను వివరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మంత్రాలయం : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మంత్రాలయం సీఐ రామాంజినేయులు సూచించారు. శనివారం మంత్రాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. విద్యార్థులు క్రమ శిక్షణ అలవరుచుకుని లక్ష్యం పెట్టుకుని చదువుకోవాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, శివ, హెచ్ఎం అంపయ్య పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ నర్సింగ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, జిల్లా సమితి సభ్యులు లింగప్ప కోరారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూర్ సర్కిల్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.600లు వరకు నిర్ణయిస్తే ఒక్కో విద్యార్థి నుంచి రూ. 4వేలు నుంచి 6వేల వరకు వసులు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఎలాంటి ఎక్యూప్‌మెంట్ లేకుండా కళాశాలను రేకుల షెడ్డులో నడుపుతున్నారని తెలిపారు. కళాశాల మేనేజ్‌మెంట్ కోటా కింద ఒక సీటుకు రూ.30 వేలు ఉంటే కళాశాల వారు మాత్రం రూ.60వేలు నుంచి రూ.70వేల వరకు వసులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శేఖర్, వీరేష్, మోహన్, నరేంద్ర, సందీప్, సునీల్ పాల్గొన్నారు.


ఆదోని సెయింట్ ఆంథోని పాఠశాలలో తాడులాగుడు పోటీల్లో విద్యార్థుల తండ్రులు


పెద్దకడబూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న హెచ్ఎం ఉమారాజేశ్వరి, విద్యార్థినులు


కోసిగి మోడల్ స్కూల్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- తల్లిదండ్రులు పిల్లల నడవడికలపై దృష్టి పెట్టాలి
- సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సదస్సు (మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం, నడవడికలపై నిఘా ఉంచాలన్నారు. పిల్లలకు విద్యార్థి దశ అనేది చాలా ముఖ్యమైనదని, చదువు వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, పురపాలక పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వరలక్ష్మి, రజక కార్పొరేషన్ చైర్మన్ కవిత, ఎంఈఓ శ్రీనివాసులు–2, హెచ్ఎం మల్లికార్జున పాల్గొన్నారు. నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంథోని పాఠశాలల హెచ్ఎంలు అలిమ్ సిద్ధిఖీ, కేశవయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆర్ఆర్‌లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నత విద్యార్థిగా ఎదగాలని తహసీల్దారు మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు, ఎంఈఓ శోభరాణిలు అన్నారు. మండలంలో కౌతాళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీచర్స్, పేరెంట్ మీటింగ్ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానుయల్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్ పాల్గొన్నారు. బాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ శివమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తోవిలో గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సమ్మకు వేదికపై చోటు ఇవ్వకపోవడపై సర్పంచ్‌తో పాటు మాజీ సర్పంచ్ నర్సప్పలు అభ్యంతరం తెలిపారు. దీంతో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో బెస్ట్‌స్కూల్‌గా ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమా రాజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ శ్రీవిద్య, ఎంఈఓ రామమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజినేయులు, తహసీల్దారు శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు ఏఎస్ఐ ఆనంద్ పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని హిందూ గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ ఈరన్న, బాలుర ఉన్నత పాఠశాలలో టీడీపీ నేత రాఘవేంద్ర రెడ్డి, బాలికల పాఠశాల, కస్తూరీ భా గాంధీ బాలికల పాఠశాలలో తహసీల్దార్ నిత్యానంద రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీఐ మంజునాథ్‌లు పేరెంట్స్ మీటింగ్‌కు హాజరయ్యారు.

క్రమశిక్షణతో చదివి రాణించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాణించాలని ,తల్లిదండ్రులు కూడా బాధ్యతతో ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్ఎంఎస్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొని మాట్లాడారు. సమావేశాల్లో ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌కు స్పందన కరువు


కేజీబీవీలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

నందవరం : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రుల స్పందన కరువైంది. శనివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రుతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే కేజీబీవీ పాఠశాలలో కనీసం 50 శాతం తల్లిదండ్రులు కూడా హాజరు కాలేదు. వచ్చిన వారికి కూడా సరైన వసతులు కల్పించలేకపోయారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సీడీపీఓ సఫర్నీసా బేగం, ఎస్ఐ శ్రీనివాసులు, డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించేలా చూడాలి


ధణాపురంలో ఎమ్మెల్సీ మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఆదోని రూరల్: విద్యార్థులు చదువులో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలని ఎమ్మెల్సీ మధుసూదన్ సూచించారు. శనివారం మండలంలోని ధణాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా టీచర్స్–పేరెంట్స్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేస్తారన్నారు. పిల్లలు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్సీకి పూలమాలలు, శాలువాలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ రాఘవేంద్ర, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సైనికుడు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బల్లేకల్ గ్రామంలో మెగా టీచర్స్–పేరెంట్స్ మీటింగ్‌లో తహసీల్దార్ శివరాముడు పాల్గొన్నారు.